# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 9, జూన్ 2026


# కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**సారంగాపూర్, జూన్ 08, ప్రభాతవార్త:**
మండలంలోని యాకర్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ భవేష్ మిశ్ర సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న వరి ధాన్యం నాణ్యతను పరిశీలించిన ఆయన, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నందున రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డులో ఎక్కడా ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకం, రవాణా సజావుగా సాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, తహసిల్దార్ విజయ్ కాంత్ రావు, స్థానిక సర్పంచ్ వడ్లకొండ దివ్యనవీన్, సీఈఓ మల్లేష్, రైతులు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మట్కా స్థావరంపై దాడి

## ఐదుగురు అరెస్ట్.. నగదు, మొబైళ్లు స్వాధీనం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 8, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో నిర్వహిస్తున్న మట్కా జూద స్థావరంపై సోమవారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,910 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం., కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నికితా పంత్ ఆదేశాల టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించామన్నారు. గాంధీచౌక్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు మట్కా జూదం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టగా ఐదుగురు పట్టుబడ్డారు. అరెస్టయిన వారిలో నదిగూడకు చెందిన లక్ష్మణ్, శివాపూర్‌కు చెందిన గులాం జిలానీ, వంజిరికి చెందిన పిప్రే దేవాజీ, కౌసర్‌నగర్‌కు చెందిన సయ్యద్ షబీద్దీన్, సెండే సురేష్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మట్కా, జూదం తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## ప్రత్యేక సభల ద్వారా ప్రజా సమస్యల

# పరిష్కారానికి చర్యలు

❖ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 8, ప్రభాతవార్త**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్లకు సంబంధించి లక్ష్మి గార్డెన్స్ లోనిర్వహించిన డివిజన్ సభకు డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ సంపత్ రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ/డివిజన్/వార్డు సభలు నిర్వహించి, పారిశుధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ, అరైవ్ అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, తడి చెత్త, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వీర్యం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని, వర్షం వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా మిగతా 2లో..









# ప్రత్యేక సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల అందజేత, స్వీకరణ, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, గత సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం కూడా అందించడం జరుగుతుందని, జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసిల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.

డిసిపి మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాలికల సంరక్షణ కొరకు షీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, తెలిసిన వాళ్ళు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినట్లు సమాచారం ఇస్తే వారిని డిఅడిక్షన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 100 నెంబర్ కు డయల్ చేసి వెంటనే సమాచారం అందించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ ఖగమంచిర్యాల శుభ్రత-ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతగ‌ా నినాదంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, వీధి దీపాలు, రోడ్ల మరమ్మత్తులు, త్రాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని, ఎలాంటి అవినీతి, దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్చేతుల మీదుగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల సంబంధిత ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.




## బదిలీపై వెళ్లిన ఏఈఓకు ఘన సన్మానం

జన్నారం, జూన్ 8, ప్రభాతవార్త

జన్నారం మండలం కవ్వాల( దేవునిగూడ) నుండి సింగరాయిపేటకు (తిమ్మాపూర్) బదిలీపై వెళ్తున్న ఏఈఓ సయ్యద్ అక్రముల్ల ఖాన్ ను కవ్వాల్ సర్పంచ్ సక్రూ నాయక్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు షాకీర్ అలీ ఆధ్వర్యంలోకవ్వాల్ గ్రామ పంచాయతీ ఆవరణలోఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ ప్రతి కార్యక్రమాన్ని రైతులకు చేరవేయడంలో,పంట మార్పిడి, ఆయిల్ పామ్ సాగులో రైతులను ప్రోత్సహించి రైతుల అభ్యున్నతికి పాటుపడటం జరిగిందని, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం రైతుల సందేహాలను నివృత్తి చేయడంలో చాలా తోడ్పాటు అందించారనివారు కొనియాడారు.గత తొమ్మిది సంవత్సరాలుగా ఇక్కడి రైతులకు ఏఈఓగా అక్రముల్ల చేసిన సేవలు మరువలేనివని ఇటువంటి అధికారి బదిలీ అవ్వడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విశ్వక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి,వార్డు సభ్యులు శ్రీనివాస్,గుమ్ముల సత్తయ్య అల్లటి రాజన్న, మహిమూద్ ఖాన్,సదా సింగ్ ,ఉల్లి పవన్ నాయకులు పెద్దలు పాల్గొన్నారు.

## సింగరేణి పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

మందమర్రి, జూన్8, ప్రభాతవార్త




సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న కళ్యాణిఖని సింగరేణి ఉన్నత పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి జూన్ 1 నుంచి 30 వరకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు జే. పురుషోత్తం తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు అవసరమైన ధృవపత్రాలతో పాఠశాల కార్యాలయంలో సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, ఇద్దరు విద్యార్థులు 555/600 మార్కులు సాధించగా, 10 మంది 500కు పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, మినరల్ వాటర్ సౌకర్యం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు.

## మజ్జిగ పంపిణీ చేసిన సర్పంచ్

### - డ్రగ్స్, గుడుంబాకు దూరంగా ఉండాలి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి

వేమనపల్లి, జూన్ 8, ప్రభాతవార్త



మండుటెండల్లో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు చల్లని ఉపశమనంగా వేమనపల్లి మండలం సుంపుటం గ్రామంలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి-తిరుపతి పాల్గొని కూలీలకు మజ్జిగ అందజేశారు. అనంతరం ఎస్సై జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎండలో పనిచేసే వారు తరచూ నీరు, మజ్జిగ వంటి పానీయాలు తీసుకోవాలని చెప్పారు. అలాగే డ్రగ్స్, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పనుల సమయంలో తగిన భద్రతా చర్యలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటి, ఉప సర్పంచ్ దందేర మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మనిపెల్లి సంజీవ్, గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఈవిఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రత చర్యలు

ఆసిఫాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదామును జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎం గోదాము వద్ద 24 గంటల పాటు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమీల్, నాయబ్ తహసిల్దార్ శ్యామ్ లాల్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యువతను సన్మార్గంలో నడిపే బాధ్యత తల్లిదండ్రులదే

(మొదటిపేజీ తరువాయి)

తమ కూతుళ్లపై చూపుతున్న శ్రద్ధను మగ పిల్లలపైనా సమానంగా చూపిస్తే వారు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదుగుతారని సూచించారు. సరైన పెంపకం లోపించడం వల్లే కొంతమంది యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి పట్టణంలో గంజాయి వినియోగం పెరుగుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సహకారంతో గంజాయి నిర్మూలనకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ చింతల వసంత మాట్లాడుతూ 15వ వార్డు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రిటైర్డ్ సీబీసీఐడీ అదనపు ఎస్పీ పులియాల రవికుమార్ మాట్లాడుతూ యువతను చెడు మార్గాల నుంచి దూరం చేయడానికి క్రీడలు కీలకమని పేర్కొన్నారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, త్వరలోనే బెల్లంపల్లిలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టి క్రీడల వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆడెపు పద్మ, మున్సిపల్ వార్డు అధికారులు అశోక్, రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నూరి వెంకటేశ్వర్లు, దేవసాని ఆనంద్, ఆర్పీ శ్రీలత, కన్నూరి రాజలింగు, కె.రాజరత్నం, చింతల బాలరాజు, యూత్ నాయకులు బొల్లి వంశీ, చింతల లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు హాజరయ్యారు.

## గుమ్ముల అశోక్‌ను పరామర్శించిన సంఘం నాయకులు

నిర్మల్, ప్రభాతవార్త:



టీయూడబ్ల్యూజే (ఐజేయు) నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్ముల అశోక్ ఇటీవల జరిగిన వాహన ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స అనంతరం ప్రస్తుతం ఆయన తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు సోమవారం గుమ్ముల అశోక్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్ కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గుమ్ముల అశోక్ త్వరగా కోలుకొని తిరిగి విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. సంఘం తరఫున ఆయనకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సట్ల హన్మాండ్లు, సభ్యులు బోజారెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## దేగాంలో వివో షేడ్ నిర్మాణానికి భూమిపూజ చేసిన సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి

భైంసా, ప్రభాతవార్త:



భైంసా మండలంలోని దేగాం గ్రామంలో వివో షేడ్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు కోసం ఏర్పాటు చేస్తున్న ఈ వివో షేడ్ గ్రామాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. దేగాం గ్రామాభివృద్ధే లక్ష ్యంగా తాము పనిచేస్తున్నామని, గ్రామ ప్రజల సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వివో సీఏ, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాల, జూన్ 8, ప్రభాతవార్త

మంచిర్యాలలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పురుషోత్తం తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీఏ విభాగాల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు మూడు సంవత్సరాల పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, భోజనం, హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9603705803, 8977568214 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# పరిశుభ్రత, పర్యావరణ రక్షణకు ప్రజల సహకారం అవసరం

**- బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్**

**బెల్లంపల్లి, జూన్ 08, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 06, 21, 26, 30, 33 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, సీఐ అనుక్, ఎస్సై కిరణ్ కుమార్, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, పారిశుద్ధ్య చెత్త హానికారక చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు మాత్రమే అప్పగించాలని సూచించారు. రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో లేదా మురుగు కాలువల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు. అలాగే పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఇతర ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ పదార్థాలు పూర్తిగా కుళ్లిపోవడానికి సుమారు 400 నుండి 500 సంవత్సరాలు పడుతుందని వివరించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ దీనికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ ఎస్సై ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలి అని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. అదేవిధంగా యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, డ్రగ్స్ నివారణ, రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రజా భద్రత అంశాల్లో ప్రజల సహకారంతో పరిశుభ్రమైన, హరిత బెల్లంపల్లి నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.





మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణ్

## ప్రజల సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలు

**- మాదారం సర్పంచ్ లక్ష్మణ్**

**తాండూర్, జూన్ 8, ప్రభాతవార్త :**

ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నదని మాదారం సర్పంచ్ కుష్నపల్లి లక్ష్మణ్ అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో సమస్యలపై జీపి పాలకవర్గ సభ్యులు, అధికారులు చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఏఎస్ఐ రవి,వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక వార్డు సభలకు విశేష స్పందన

**- ప్రతి వార్డుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి: మంద తిరుమల్ రెడ్డి**

**మందమర్రి, జూన్ 8, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా సోమవారం మందమర్రి పట్టణం మార్కెట్ కటికే దుకాణాల ప్రాంగణంలో 14వ, 17వ వార్డులకు సంయుక్తంగా వార్డు సభ నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్ హాజరయ్యారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ వార్డు సభల ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, మందమర్రి పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పెన్షన్లు, తాగునీటి సమస్యలు తదితర ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో మందమర్రి పట్టణంలోని అనేక వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వార్డు సభల్లో ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని 14వ వార్డు ఇన్‌చార్జిలు నెరువట్ల శ్రీనివాస్, ఎండీ ఇషాక్, రాయబారపు కిరణ్, బియ్యపు రవికిరణ్, గట్ల సారంగపాణి, 17వ వార్డు ఇన్‌చార్జిలు కనకం రాజు, విద్యాసాగర్, సాయికిరణ్, ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ఆర్పీలు, వార్డు అధికారులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని వార్డు అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు చేశారు.





విద్యార్థులను మెమొంటోలతో అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్, అధికారులు

# నాణ్యమైన విద్యకు ఈసెట్ ర్యాంకులే నిదర్శనం

**- సింగరేణి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభను కొనియాడిన శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, జూన్ 8, ప్రభాతవార్త**

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల కంటే సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతోందని చెప్పడానికి రెండు రాష్ట్రాల ఈసెట్ ఫలితాల్లో విద్యార్థులు సాధించిన ర్యాంకులే నిదర్శనమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కొనియాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఈసెట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను జీఎం కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ర్యాంకర్లకు మెమొంటోలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈసెట్ విజేతల వివరాలతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించారు. మైనింగ్ విభాగంలో బొడ్డ మినీక్ష ఏపీ ఈసెట్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించగా, శ్రీపతి ఆదిత్య తెలంగాణ ఈసెట్లో 4వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. వీరితో పాటు మెకానికల్, మైనింగ్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ విభాగాలలో 500 లోపు 80 మంది, వెయ్యి లోపు 70 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చారు. సింగరేణి ఉద్యోగులకే కాకుండా ఈ ప్రాంత ప్రజలకూ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ఒక వరమని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంజనీరింగ్‌లోనూ ఇలాగే రాణించి తల్లిదండ్రులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం సాగుతున్న అడ్మిషన్ల ప్రక్రియలో విద్యార్థులు ఈ కళాశాలలో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) ఎన్. అనిల్ కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ కుర్మ రాజేందర్, డీజీఎం ఎన్. డినీల్ కుమార్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నరసాపూర్లో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభ

## ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

**- నర్సాపూర్ సర్పంచ్ ప్రభాత్‌రావు**

**తాండూర్, జూన్ 8, ప్రభాతవార్త :**

భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని నర్సాపూర్ సర్పంచ్ మడావి ప్రభాత్ రావు అన్నారు. నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై చర్చించారు. గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై సౌజన్య, డిసిసి ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ పర్వతరావు, ఏఈ మనోహర్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలో రిటైర్డ్ అంగన్వాడీ టీచర్‌కు సన్మానం

**తాండూర్, జూన్ 8, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ లక్ష్మణ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ జరిగింది. మాదారంలో అంగన్వాడి టీచర్ గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన అంగన్వాడి టీచర్ అనసూర్య, ఆమె భర్త సుబ్రహ్మణ్యంను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, డిఈ మల్లయ్య, ఏఈ మనోహర్,వార్డు సభ్యులు బాణేష్, లలిత, సౌమ్య, పంచాయతీ కార్యదర్శి అల్లావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం



## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూన్ 8, ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్ అవార్డు గ్రహీత అశోక్ మహాల్కర్ సన్మానిస్తున్న బీఎస్పీ సంఘ నాయకులు

## భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**వాంకిడి, జూన్ 8,ప్రభాతవార్త :**

భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ రాజు మహుల్కర్ ఇటీవల లూసియానా అమెరికన్ రీసెర్చ్ యూనివర్శిటీ పూణే నుండి డాక్టరేట్ అందుకున్న ఆయన జన్మ దిన సందర్భంగా మండల మైనారిటీ సొదరులు,మహారాష్ట్రలోని రాజుర నియోజక వర్గం బిఎస్ పి పార్టీ అధ్యక్షుడు సురేష్ మెస్రం అధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ద విహార్ లో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాజిక సేవ రంగంలో డాక్టర్ అశోక్ మహుల్కర్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమ సమాజ నిర్మాణంలో సహకరించి ఆయనతో పాటు నడవడానికి ముందు ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, అంబెడ్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజి,ప్రధాన కార్యదర్శి విజయ్, ఎస్ ఎస్ డీ జిల్లా ఆర్గనైజర్ రోషన్,ముస్లిం మైనారిటీ నాయకుడు నవుషాద్, మహమ్మద్ రఫీ,బౌద్ధ సమాజ అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు,నాయకులు ఉప్రే ప్రకాష్, రమేష్,ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో మునిగి వ్యక్తి మృతి

**వేమనపల్లి, జూన్ 08, ప్రభాతవార్త**



మారమ్మ జాతరకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని జిల్లేడ గ్రామంలో విషాదాన్ని నింపింది. మృతుడు ఆర్కిల్ల భీమయ్య (55)గా గుర్తించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, భీమయ్య ఆదివారం తన కులదైవమైన మారమ్మ జాతరకు వెళ్లే ముందు చేవెళ్ల ప్రాజెక్టు కాలువలో స్నానం చేసి నక్కలపల్లి జాతరకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే రాత్రి వరకు ఇంటికి చేరుకోక పోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు గురై పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అయినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గ్రామస్తులు మరోసారి వెతుకుతుండగా జిల్లేడ శివారులోని చేవెళ్ల ప్రాజెక్టు కాలువలో భీమయ్య మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో భీమయ్య స్నానం కోసం కాలువలో దిగిన సమయంలో నీటి లోతు ఎక్కువగా ఉండటం, ఈత రాకపోవడం వల్ల మునిగి మృతి చెందినట్లు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమయ్య మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# వానాకాలం వ్యవసాయ సాగుకు ముందస్తు కార్యచరణ

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, జూన్ 8, ప్రభాతవార్త**

రాబోయే వానాకాలం వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ సహాయ అధికారులు, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గత 56 సంవత్సరాలతో పోలిస్తే సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పంటల వైవిధ్యీకరణ, మిశ్రమ, స్వల్పకాలిక పంటల సాగు, వంటి ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా అవగాహన కల్పించాలని, విత్తనాలు వేసే ముందు కనీసం 3 నుండి 4 రోజుల పాటు వర్షాలు కురిసి, భూమిలో ఒకటి నుండి ఒకటిన్నర అడుగుల లోతు వరకు తగిన తేమ ఉన్న తర్వాతే విత్తనాలు విత్తాలని రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని, పంట అవశేషాలను పొలాలలో తగులబెట్టే చర్యలను పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పంట అవశేషాల దహనం వల్ల వాయు కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడటమే కాకుండా నేలలో సారం తగ్గిపోవడం వంటి అనేక నష్టాలు కలుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పొలాలలో పంట అవశేషాలను తగులబెట్టే రైతులపై గ్రామపంచాయతీల ద్వారా 2 వేల 500 రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందని, జరిమానా చెల్లించని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యానికి టోకెన్ల జారీని నిలిపివేసే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు 08 రకాల సన్న ధాన్యం సాగు చేసేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రసాయన వ్యవసాయం నుండి సహజ, సేంద్రియ వ్యవసాయానికి రైతులను మళ్లించే లక్ష్యంతో అమలు చేస్తున్న ..జాతీయ సహజ వ్యవసాయ మిషన్.. కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 17 క్లస్టర్లలో ప్రతి క్లస్టర్‌కు 125 మంది రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ అందించి, దశల వారీగా సహజ వ్యవసాయ విధానాల వైపు మళ్లించాలని, నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాబోయే 10 రోజుల పాటు వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా గ్రామాల వారీగా పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగు పద్ధతులు, పంటల ఎంపిక, నీటి వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో రైతు నమోదు కార్యక్రమ నిర్వహణను క్రమబద్ధంగా చేపట్టి, గ్రామ పర్యటనల అనంతరం నివేదికలను సమర్పించాలని తెలిపారు. వానాకాలం సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహం ఆవిష్కరణకు తరలిరండి

**వాంకిడి, జూన్ 8, ప్రభాతవార్త :**



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా నాయకులు

వాంకిడి మండలంలోని ఖమానా గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహం ఆవిష్కరణ ఈ నెల 13వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ పిలుపు నిచ్చారు.సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ద విహార్ లో కార్యక్రమ గోడా ప్రతులను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పల్లెటూరులో లో సైతం మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు.అయితే ఈ గ్రామ ప్రజలు మహాత్మ జ్యోతి రావు పూలే దంపతుల అడుగు జాడల్లో నడవాలని అన్నారు . ఈ కార్యక్రమం లో ఆసిఫాబాద్ జిల్లా సమతా సైనిక దళ్ అధ్యక్షులు దుర్గం సందీప్, అంబెడ్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజి,ప్రధాన కార్యదర్శి విజయ్,ఉపాధ్యక్షులు దుర్గం సునీల్ కుమార్, ఏస్ ఏస్ డి జిల్లా ఆర్గనైజర్ రోషన్,ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు, సమాజ అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు లహిజి, మాలి సంఘం నాయకులు అదే శంకర్, మోహర్లే గంగాధర్,నానాజీ, అదే వెంకటి,రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారమే తమ ధ్యేయం

**ఆసిఫాబాద్, జూన్ 8, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్

ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో 2, 3, 4 , 16, 17 వార్డుల ప్రత్యేక సభలు సోమవారం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల చుట్టుపక్కల ఎక్కడా చెత్తచెదారం వేయవద్దని, ముఖ్యంగా డ్రైనేజీలలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పడేయడం వల్ల మురుగు నీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. వార్డులలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా స్థానిక కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని, మున్సిపల్ యంత్రాంగం ద్వారా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బాలకృష్ణ, దూడల లక్ష్మి, మున్సిపల్ మేనేజర్ సర్వర్, విద్యుత్ శాఖ ఏఈ కే లక్ష్మీ రాజం, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాటలో విద్యార్థుల నమోదు పెంపొందించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**నస్పూర్, జూన్ 8, ప్రభాతవార్త**

జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల బ్రహ్మారావు, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు లలిత లతో కలిసి పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్‌లతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన పాఠశాలలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా పాఠశాల తరగతి గదులు, ఆవరణ శుభ్రం చేయించాలని, వంటగది, వంట పాత్రలు శుభ్రపరచాలని, మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యం సమకూర్చుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు చేరుకున్నాయని, వెంటనే పాఠశాలలకు చేరవేయాలని మండల విద్యాధికారులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో గత సంవత్సరంలో ఉన్న నమోదు కంటే ఈ సంవత్సరం 10 శాతం అడ్మిషన్లు పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక/ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాలలో 5/ 7/ 8 తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థిని సమీప ప్రాథమికోన్నత / ఉన్నత పాఠశాలలో తప్పకుండా చేర్పించి సంబంధిత నూతన పాఠశాల ప్రధానోపాధ్యాయులచే యుడైస్ స్టూడెంట్ మాడ్యూల్‌లో ఇంపోర్ట్ చేయించాలని, విద్యార్థుల నూతన పాఠశాల, ప్రవేశ వివరాలను మండల విద్యాధికారికి నిర్ణీత నమూనాలో సమర్పించాలని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని సమీప జూనియర్ కళాశాలలో చేర్పించాలని, ప్రతి విద్యార్థి ప్రాథమిక పాఠశాల దశ నుండి ఇంటర్మీడియట్ దశ వరకు నిరాటంకంగా చదువు కొనసాగించేలా డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని, తద్వారా 100 శాతం విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని తెలియజేశారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలను వదిలి వెళుతున్న విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్ ఇచ్చే



క్రమంలో తప్పకుండా విద్యార్థి నూతనంగా ప్రవేశం పొందిన పాఠశాల, ప్రవేశ వివరాలను నిర్ణీత నమూనాలో రికార్డులో భద్రపరచాలని, మండల విద్యాధికారికి సమర్పించాలని, తద్వారా డ్రాప్ బాక్స్ లో ఏ విద్యార్థి ఉండకుండా, డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని తెలిపారు. భవిత కేంద్రాలు సరైన క్రమంలో నడిచే విధంగా మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని, జూన్ 15న ఏదైనా పాఠశాల పునఃప్రారంభం కానట్లయితే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మధ్యాహ్న భోజనం మొదటి రోజు నుండి అమలు చేయాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు తాము వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలని, మండల విద్యాధికారులు ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్, జే. సత్తయ్య, కె. కృష్ణమూర్తి, కే.విజయలక్ష్మి, ఏ.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోస్లే విశాల్‌ను శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న బాజీరావ్ పాటిల్, వసంతరావు పటేల్

## అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించిన యువకుడికి ఘన సన్మానం

**- బాజీరావ్ పాటిల్**

**భైంసా, జూన్ 08, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకం ద్వారా సైనిక ఉద్యోగానికి ఎంపికైన బోస్లే విశాల్‌ను ముథోల్ నియోజకవర్గ యువ నాయకుడు బాజీరావ్ పాటిల్ ఘనంగా సన్మానించారు. భైంసా మండల కేంద్రానికి చెందిన బోస్లే చంద్రకాంత్ కుమారుడు బోస్లే విశాల్ అగ్నివీర్ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి ఉద్యోగం సాధించారు. ఈ విషయం తెలుసుకున్న బాజీరావ్ పాటిల్ సోమవారం విశాల్ నివాసానికి వెళ్లి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా బాజీరావ్ పాటిల్ మాట్లాడుతూ అగ్నివీర్ ద్వారా దేశసేవ చేసేందుకు యువతకు గొప్ప అవకాశం లభిస్తుందన్నారు. అనేక మంది గ్రామీణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని అందుకొని ముందుకు సాగుతున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అంతా ఈ అగ్నివీర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కష్టపడి దేశ రక్షణ విధుల్లో చేరిన విశాల్ తోటి యువకులకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు వసంతరావు పటేల్, యోగేష్, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నేడు మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

**భైంసా, జూన్ 08, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో సోమవారం ఉదయం 11 గంటలకు మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఈ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముథోల్ నియోజకవర్గ ప్రజలు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకులు కోరారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన సర్పంచ్ శ్రీలత

**దిలావర్‌పూర్, జూన్ 08, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలం న్యాలోలాం గ్రామపంచాయతీలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు సర్పంచ్ శ్రీలత మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో పనులకు వచ్చే కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీవో గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కూలీలు తగిన ఆరోగ్య పరిరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఏపీఓ దివ్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీలత, అధికారులు



## వికలాంగులు, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందించాలి

**- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి**

**మందమర్రి, జూన్ 8, ప్రభాతవార్త**


మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో గృహరహితులైన అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు నెలకు రూ.6,000, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితర ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు రూ.4,000 పెన్షన్ అమలు చేయాలని కోరారు. అలాగే అర్హత కలిగిన వికలాంగులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, అంబేద్కర్ సంఘం నాయకులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ, మందమర్రి పట్టణ అధ్యక్షుడు రాము శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు రామటంకి దుర్గారాజ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల శంకర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గోమాస బ్రహ్మానందం, మందమర్రి మండల అధ్యక్షుడు రహీం బాబా, అంబేద్కర్ సంఘం నాయకుడు డబ్బ్యూ. సురేందర్, టీడీపీ రాష్ట్ర నాయకులు బైరాజు శ్రీనివాస్, బైరాజు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చకుడు వేణుగోపాల్ శర్మను విధుల నుంచి తొలగించాలి

**- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు మాజీ సర్పంచ్ ఫిర్యాదు**

**బెల్లంపల్లి, జూన్ 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీలో ఉన్న శ్రీ పెద్ద బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకుడు రాంబట్ల వేణుగోపాల్ శర్మను వెంటనే సేవల నుంచి తొలగించాలని మాజీ సర్పంచ్ మంద అనిత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాదులో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి ఆమె వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మంద అనిత వివరాల ప్రకారం, వేణుగోపాల్ శర్మ 1998లో ఆసిఫాబాద్‌లోని శివ మల్లన్న ఆలయంలో అర్చకుడిగా పనిచేశారని, అనంతరం బదిలీపై బెల్లంపల్లికి వచ్చినట్లు చెప్పారు. ఆయన ప్రవర్తన సరిగా లేదని ఆరోపణల నేపథ్యంలో 2022లో ఆలయ ధర్మకర్తలు ఫిర్యాదు చేయగా అప్పట్లో ఆయనను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. తర్వాత 2023లో తిరిగి విధుల్లో చేరిన వేణుగోపాల్ శర్మ మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా ఒక మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025లో కూడా మహిళలపై ఇలాంటి అనుచిత చర్యలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అర్చకుడిపై కఠిన చర్యలు తీసుకొని వెంటనే విధుల నుంచి తొలగించాలని మంద అనిత కమిషనర్‌ను కోరినట్లు తెలియజేశారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూన్ 8, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్‌లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం మండల కేంద్రానికి చెందినరాజు గౌడ్ తాను డిగ్రీ, పిజిడిసిఏ, డి.ఈడి పూర్తి చేశానని, గతంలో కంటి వెలుగు కార్యక్రమంలో పనిచేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. చెన్నూర్ మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన సైదల పద్మ తన ప్రజా పాలన వివరాలను దుగ్నేపల్లి గ్రామపంచాయతీ నుండి చెన్నూరు మున్సిపాలిటీకి మార్పు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన కడారి బీరయ్య తనకు గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉందని, ఊరిలోని అందరి ఇళ్ళ నుండి వచ్చే మురుగునీరు తన భూమిలోకి రావడంతో వ్యవసాయ సాగు చేయలేకపోతున్నానని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని సుభాష్ రోడ్‌కు చెందిన జె.శాంతయ్య తాను సింగరేణి ఉద్యోగం చేసి పదవి విరమణ పొందానని, తాను కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఇంటిని తన పెద్ద కుమారుడు ఆక్రమించుకున్నాడని, తన చిన్న కుమారునికి సింగరేణి ఉద్యోగం కల్పించానని, ప్రస్తుతం తన కుమారులు తన, తన భార్య బాగోగులు చూడడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భూపాలపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన బుర్ర లచ్చయ్య తన తండ్రి పేరిట జైపూర్ మండలం షెట్ పల్లి గ్రామ శివారులో భూమి ఉందని, ఆయన మరణానంతరం కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగడి రాములు తనకు గతంలో 88 శాతం దివ్యాంగత్వం నిర్ధారించబడి పింఛన్ మంజూరు అయిందని, ఇప్పుడు తక్కువ శాతంతోనిర్ధారించడంతో పింఛన్ ఆగిపోయిందని, నిరుపేద అయిన తన పరిస్థితి అర్థం చేసుకొని పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ ప్రాంతవాసులు తమ ప్రాంతంలోని రైల్వే గేట్ వెనక ఏర్పాటు చేస్తున్న బార్ కం రెస్టారెంట్ నివాస గృహాల మధ్యన రైల్వే ఫుడ్ ఓవర్ బ్రిడ్జికి అతి సమీపంలో ఉన్నందున అభ్యంతరాలు తెలుపుతున్నామని, బార్ కం రెస్టారెంట్ ఏర్పాటు నిలుపుదల చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పిడిఎస్‌యు ప్రతినిధులు తమ దరఖాస్తులో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల పట్టిక నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కోరారు. చెన్నూర్ పట్టణంలోని పద్మ నగర్‌కు చెందిన తస్నీరు ప్రమీల నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మండల కన్వీనర్ శివారెడ్డి

**నేరడిగొండ, జూన్ 08, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నెరడిగొండ మండలంలోని బుద్దికొండ నుండి తేజాపూర్ గ్రామం వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుతో పాటు సీడీ వర్క్స్, సీసీ రోడ్డు పనులకు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రోడ్ల నిర్మాణమే కీలకమన్నారు. బుద్దికొండ – తేజాపూర్ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ప్రయాణ ఇబ్బందులు తొలగిపోయి, గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం అవుతుందన్నారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ నవీన్, ఉప సర్పంచ్, బుద్దికొండ సర్పంచ్ మహేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, శోభన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, నెరడిగొండ సర్పంచ్ రవీంధర్ రెడ్డి, ప్రదీప్, నల్ల లక్ష్మణ్, విద్యాసాగర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, పోతారెడ్డి, గులాబ్, వడూర్ సర్పంచ్ శ్రీకాంత్, సాబ్లే ప్రతాప్, సాబ్లే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

**- విద్యార్థి నాయకులు చేరాల వంశీ**



**బెల్లంపల్లి, జూన్ 08, ప్రభాతవార్త**

విద్య అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. కానీ నేటి పరిస్థితుల్లో అది హక్కుగా కాకుండా వ్యాపారంగా మారిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులపై భరించలేని స్థాయిలో ఫీజుల భారాన్ని మోపుతున్నాయి. ప్రస్తుతం అనేక ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యాసంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి. పుస్తకాలు, యూనిఫాంలు, టైలు, బెల్టులు, బ్యాగులు, స్టేషనరీ వంటి వస్తువులను బయట కొనుగోలు చేసే అవకాశాన్ని నిరోధిస్తూ, తమ సంస్థల ద్వారానే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. రోజువారీ కూలి చేసి జీవించే పేద, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొందరు అప్పులు తీసుకుంటుండగా, మరికొందరు తమ ఆస్తులను విక్రయిస్తున్నారు. మరికొందరు ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి పిల్లల చదువులు కొనసాగిస్తున్నారు. విద్య కోసం కుటుంబాలు అప్పుల ఊబిలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం ఎంతో బాధాకరం.

ఈ పరిస్థితుల్లో పేద కుటుంబాలకు విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ఆర్థికంగా వెనుకబడిన వారికి చదువుకునే హక్కు లేదా? డబ్బు ఉన్నవారికే నాణ్యమైన విద్య అందాలా? అనే ప్రశ్నలు సమాజంలో తలెత్తుతున్నాయి. విద్య హక్కు చట్టం ప్రభుత్వ నిబంధనలను అనేక విద్యాసంస్థలు బహిరంగంగా ఉల్లంఘిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది. ఫీజుల నియంత్రణ, పారదర్శకత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అత్యవసరం ఉంది. విద్య వ్యాపారం కాదు – ఇది ఒక సామాజిక బాధ్యత. ప్రతి పేద, మధ్యతరగతి విద్యార్థికి అందుబాటులో ఉండేలా విద్యా వ్యవస్థను రూపొందించడం ప్రభుత్వాల కర్తవ్యం. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసి, విద్యను అందరికీ చేరేలా చేయాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారని విద్యార్థి నాయకులు చేరాల వంశీ ఒక ప్రకటనలో తెలియజేశారు.



ఏఈఈ ముత్యం రాజశేఖర్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్‌లు, గ్రామస్థులు

# ఏఈఈ ముత్యం రాజశేఖర్‌కు ఆత్మీయ సన్మానం

**దిలావర్‌పూర్, జూన్ 08, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలంలో పనిచేసి సారంగాపూర్ మండలానికి బదిలీపై వెళ్లిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ముత్యం రాజశేఖర్‌కు కంజర్ గ్రామంలో సోమవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు వినోద్ కుమార్, మధుకర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కంజర్ గ్రామ ప్రత్యేక అధికారిగా పనిచేసిన సమయంలో గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ముఖ్యంగా గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడంతో పాటు యువతకు క్రీడా కార్యక్రమాలు, మహిళలకు సాంస్కృతిక పోటీలను నిర్వహించారని వక్తలు కొనియాడారు. అనంతరం ఏఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ కంజర్ గ్రామ ప్రజలు అందించిన ప్రేమ, సహకారం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఎంఈఓ మహేందర్**

**సారంగాపూర్, జూన్ 08, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు 2026-27 విద్యా సంవత్సరానికి గానూ సర్కారు బడుల్లో ఎల్కేజీ, యూకేజీ తరగతులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా విద్యను బోధించడానికి ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల నియామక ప్రక్రియను చేపట్టింది. సారంగాపూర్ మండలంలోని యాకర్ పల్లి ప్రభుత్వ పాఠశాలకు ఈ పోస్టులు మంజూరయ్యాయని మండల విద్యాధికారి మహేందర్ తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానికులై ఉండాలని స్పష్టం చేశారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్, డైట్ సెట్ ఉత్తీర్ణులైన వారు, ఆయా పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 9 నుండి జూన్ 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

# అడెల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంపీఓ అజీజ్ ఖాన్

**సారంగాపూర్, జూన్ 08, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి గ్రామంలో, ప్రసిద్ధ అడెల్లి పోచమ్మ ఆలయ పరిసరాలలో సోమవారం ఎంపీఓ అజీజ్ ఖాన్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఆలయ పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉండడం, కోనేరు వద్ద భక్తులు స్నానాలు చేసిన మురికినీరు రోడ్డుపైకి వస్తుండడాన్ని గమనించారు. ఆ నీటి నివారణకు చేపట్టిన ఇంకుడు గుంత నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఆలయ పరిసరాలతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమలు వ్యాపించకుండా మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాయన్న, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ సాయన్న